మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 24-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 325 Issue: 325

24 మే 2026 - ఆదివారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:45, సూర్యాస్తమయం - సా. 6:40, తిథి, నవమి తె. 4:32ం వరకు, తరువాత దశమి, సంస్కృత వారం, భాను వాసరః, నక్షత్రం, పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 2:48ం వరకు, తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర), యోగం, హర్షణ తె. 3:41ం వరకు, కరణం, భాలవ సా. 4:29 వరకు, కౌలవ తె. 4:32ం వరకు, వర్జ్యం, ఉ. 10:23 నుండి మ. 12:02 వరకు, దుర్ముహూర్తం, సా. 4:56 నుండి సా. 5:48 వరకు, రాహుకాలం, సా. 5:03 నుండి సా. 6:40 వరకు, యమగండం, మ. 12:13 నుండి మ. 1:49 వరకు, గుళికాకాలం, మ. 3:26 నుండి సా. 5:03 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:09 నుండి తె. 4:57 వరకు, అమృత ఘడియలు, రా. 8:14 నుండి రా. 9:53 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు, , గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana





## ఇంటర్ కాలేజీల్లో

# మధ్యాహ్న భోజనం



- ఉదయం పాలు, బ్రేక్‌ఫాస్ట్ కూడా
- గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు
- తొలి విడతగా 300 కోట్లు మంజూరు
- కరీంనగర్‌లో పారా బలగాల సెంటర్లు
- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

**త్వరలో ప్రారంభం కానున్న 2026-2027 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం ప్రకటించింది. అదే సమయంలో స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు కూడా అందించేందుకు నిర్ణయం తీసుకుంది.**

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా ఈ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులకు.. రూ.1000 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే మొదటి విడత కింద రూ.300 కోట్లను మంజూరు చేసేందుకు తెలంగాణ కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలైన అస్సాం రైఫిల్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సెంటర్లను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు కరీంనగర్ జిల్లాను

- తరువాయి 2 వ పేజీలో...

# 10 రోజుల్లో మూడోసారి!

## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

- పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంపు
- హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర. 112.81, డీజిల్. 100.94 కి చేరిక




హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచాయి. ఈ మేరకు శనివారం పెట్రోల్‌పై లీటర్‌కు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 99.51కి చేరగా, డీజిల్ ధర రూ. 92.49కి చేరుకుంది. గత 10 రోజుల వ్యవధిలో ఇంధన ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో

- తరువాయి 2 వ పేజీలో...



# 90 మంది ప్రాణాలు బుగ్గి

## చైనాలోని ఓ బొగ్గుగనిలో భారీ పేలుడు

- ప్రమాద సమయంలో 247 మంది కార్మికులు
- 201 మందిని కాపాడిన రెస్క్యూ బృందాలు

**చైనాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో సుమారు 90 మంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. పలువురు ఇంకా భూగర్భంలో చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.**

బీజింగ్: ఇటీవల కాలంలో చైనాలో జరిగిన అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఇదొకటిగా ప్రభుత్వ మీడియా పేర్కొంది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగౌజ్ గ్రూప్‌కు చెందిన లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం(మే 22వ తేదీ) రాత్రి 7:29 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 247 మంది కార్మికులు భూగర్భంలో

- తరువాయి 2 వ పేజీలో...

# థాయ్ 60 రోజుల ఫ్రీ వీసా రద్దు




బ్యాంకాక్: వీసా సరళీకృతం, పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా భారత్ సహా మొత్తం 93 దేశాలు, ఇతర ప్రాంతాలకు వర్తించే '60 రోజుల ఉచిత వీసా' సౌకర్యాన్ని థాయిలాండ్ రద్దు చేసింది. ఈ మేరకు వీసా నిబంధనల్లో మార్పులకు థాయిలాండ్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిబంధనలు, స్పష్టమైన చట్టాలు, మరింత సులభతరమైన ఎంట్రీ విధానంపై థాయ్

- తరువాయి 2 వ పేజీలో...

# బక్రీద్ సెలవు 28న!

బక్రీద్ పండగ సెలవును 27వ తేదీకి బదులు.. 28కి మార్చుతూ తెలంగాణ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఆ రోజున జరగనున్న పలు పరీక్షలు వాయిదా పడ్డాయి. మే 28వ తేదీన జరగాల్సిన ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ పరీక్షను మే 29వ తేదీకి

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,906 |
| వెండి (కిలో): | రూ.2,95,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,058 |




# యాదగిరిగుట్టకు సొబగులు

- వేదపాఠశాలకు అంకురార్పణ
- నిత్యకల్యాణం, రంగం మండపాల నిర్మాణం
- శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్

యాదగిరిగుట్ట, మే 23 (ఈవార్తలు): పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు తాజాగా శంకుస్థాపనలు చేశారు. యాదగిరిగుట్టలో సంప్రదాయ వేదపాఠశాల భవనానికి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో శంకుస్థాపన చేశారు. రూ.43.79 కోట్లతో యాదగిరిగుట్టలో పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న వేదపాఠశాల భవనానికి సీఎం రేవంత్ రెడ్డి అంకురార్పణ చేశారు. రానున్న 2 ఏళ్లలో ఈ వేద పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి.. తరగతులు

- తరువాయి 2 వ పేజీలో...



# వడదెబ్బతో 16 మంది మృతి

## తలా రూ.4 లక్షల పరిహారం.. మంత్రి పొంగులేటి వెల్లడి



**తెలంగాణ రోజురోజుకూ నిప్పుల కుంపటిగా మారుతోంది. రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. రాష్ట్రంలో ఎండలు, వడగాలులు, వడదెబ్బ పరిస్థితులపై అత్యవసర సమీక్ష నిర్వహించారు.**

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): రాష్ట్రంలో రానున్న 3 రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్న నేపథ్యంలో.. ప్రజలంతా మరింత అలర్ట్‌గా ఉండాలని మంత్రి కీలక సూచనలు చేశారు. పిల్లలు, వృద్ధులు అత్యవసరమైతేనే బయటికి రావాలని తేల్చి చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రజలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో వడదెబ్బ పరిహారం రూ.50 వేలు ఉండగా.. దాన్ని రూ.4 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఇక తెలంగాణలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండగా.. 18కి పైగా

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జపాన్ స్కూళ్లలో మార్కుల కంటే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిత్వ నిర్మాణంపై దృష్టి పెడతారు. నిర్మాణంపై దృష్టి పెడతాయి. పెద్దల పట్ల గౌరవం, క్రమశిక్షణ, తరగతి గదుల పరిశుభ్రత, జట్టుగా పనిచేయడం, ఉపాధ్యాయులకు నమస్కరించం, వినయాన్ని ప్రదర్శించడం వంటివి నేర్పిస్తారు.

# భారత్ మా టార్గెట్ కాదు

- గ్రీన్ కార్డు నిబంధనలపై మార్కో రూబియో
- మోదీతో భేటీ.. యూఎస్ రావాలని ఆహ్వానం




**కొత్తగా తీసుకొచ్చిన గ్రీన్ కార్డు నిబంధనలపై భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వలసదారులు గ్రీన్‌కార్డ్ కోసం తమ దేశాల నుంచే దరఖాస్తు చేసుకోవాలనే కొత్త నిబంధన కేవలం భారతదేశాన్ని మాత్రమే ఉద్దేశించింది కాదని, ఇది ప్రపంచవ్యాప్తంగా అందరికీ వర్తిస్తుందని ఉద్ఘాటించారు.**

న్యూఢిల్లీ: ఈ మేరకు ఆయన ఎన్డీటీవీతో ప్రత్యేకంగా మాట్లాడారు. "ఇది కేవలం భారత్‌కే కాదు ప్రపంచం మొత్తానికి వర్తిస్తుంది.. మా వలస విధానాన్ని మరింత మెరుగుపరచాలని నిర్ణయం తీసుకున్నాం.. అసలు విషయం ఏమిటంటే.. దీనిని ప్రతి దేశం అర్థం చేసుకుంటుందని నేను భావిస్తున్నాను.. కొన్నేళ్ల కిందట దురదృష్టవశాత్తూ మా దేశం తీవ్రమైన వలస సంక్షోభాన్ని ఎదుర్కొంది" అని రూబియో తెలిపారు. "దాదాపు 20 మిలియన్ల మందికిపైగా మా దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించారు.. అనేక సందర్భాల్లో గ్రీన్‌కార్డ్ విధానం దుర్వినియోగం జరుగుతోంది.. అందుకే

- తరువాయి 2 వ పేజీలో...



# ఠాణాల్లో ఏఐ కాపీ రైటర్

- 10 భాషల్లో ఫిర్యాదు.. దేశంలోనే తొలిసారి
- హైదరాబాద్ పోలీసుల ఘనత

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీసులు అంటేనే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. నేరస్థులను పట్టుకోవడం, టెక్నాలజీని ఉపయోగించడం, సైబర్ కేటుగాళ్లను దొరకబట్టడం వంటి అనేక ఛాలెంజింగ్ కేసులను విజయవంతంగా ఛేదించి.. హైదరాబాద్ పోలీసులు.. ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత

- తరువాయి 2 వ పేజీలో...

# తెలంగాణ ఐపీఎల్! 8 జట్లతో టోర్నీ

## జూన్ 20న తొలి మ్యాచ్: హెచ్‌సీఏ.. జిల్లా, ఫ్రాంచైజీ వివరాలు వెల్లడి




హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ తరహాలోనే తెలంగాణలో టీజీపీఎల్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే హైదరాబాద్, వరంగల్ సహా మొత్తం 8 టీమ్‌లను ఏర్పాటు చేసింది. టీజీ20 లీగ్ జూన్ 20వ తేదీన ప్రారంభం కానుంది. మొత్తం 8 జట్లను ఏర్పాటు చేయగా.. అందులో హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ టీమ్‌లు ఈ టీజీ20 లీగ్ పోటీ పడనున్నాయి. జూన్ 20వ తేదీన తొలి మ్యాచ్ జరగనుండగా.. ఫైనల్ జూలై 11వ తేదీన ఫైనల్ నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే టీజీ20 టీమ్‌ల బిడ్‌లను కూడా హెచ్‌సీఏ తెరిచింది. ఇక ఈ లీగ్‌లో ఆడే క్రికెటర్లకు సంబంధించిన వేలాన్ని జూన్ 7వ తేదీ నిర్వహించనుంది.

## రాశి ఫలాలు

24-5-2026

మేషం: ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. బంధుమిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వ్యాపారులకు చిక్కులు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి.

వృషభం: ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారమున ఆశించిన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విద్యార్థులకు విదేశీ ప్రయాణ ప్రయత్నాలలో కీలక సమాచారం అందుతుంది.

మిధునం: ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు ముందుకు సాగవు. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు.

కర్కాటకం: గృహ వాతావరణం సందడిగా ఉంటుంది. వ్యాపారులకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. అవసరానికి సన్నిహితుల సహాయం పొందుతారు. స్థిరాస్తి విషయాలలో చికాకులు తొలగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగులకు దీర్ఘకాలిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

సింహం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆరోగ్యపరంగా వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వ్యాపారులకు గందరగోళ పరిస్థితులుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

కన్య: వృత్తి వ్యాపారాలలో అనుకున్నది సాధిస్తారు. దైవచింతన పెరుగుతుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ యత్నాలలో విజయం సాధిస్తారు. సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు.

తుల: వాహన వ్యాపారస్తులకు విశేషమైన లాభాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. ఆలయ దర్శనం చేసుకుంటారు. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహారిస్తారు. ఆర్థికంగా పురోగతి కనిపిస్తుంది. ఉద్యోగులకు అధికారుల అండదండలతో నూతన అవకాశములు లభిస్తాయి.

వృశ్చికం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారమున స్వల్ప లాభాలు అందుతాయి. బంధు మిత్రులు మీ మాటతో విబేదిస్తారు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక వాతావరణం చికాకుగా ఉంటుంది.

ధనస్సు: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. అవరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. ఉద్యోగులకు సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. చేపట్టిన పనుల్లో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది.

కుంభం: మిత్రుల నుంచి శుభవర్తమానాలు అందుతాయి. భూ వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారములు ఉత్సాహంగా సాగుతారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. నిరుద్యోగుల ఊహలు నిజమవుతాయి. ఉద్యోగుల ప్రతిభకు మంచి గుర్తింపు లభిస్తుంది. విద్యార్థుల కష్టం ఫలిస్తుంది.

మీనం: వృధా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. అనారోగ్య విషయంలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ప్రయాణాల్లో ఆకస్మిక మార్పులుంటాయి. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున పరిస్థితులు అంతగా అనుకూలించవు.




# యాదగిరిగుట్టకు సొబగులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రూ.9.88 కోట్లతో యాదగిరిగుట్టపై నిత్య కల్యాణం.. రంగం మండపాల నిర్మాణం చేయనున్నారు. అదే సమయంలో రూ.1.41 కోట్లతో గుట్ట కింది నుంచి కొండ పైకి ఉన్న మెట్ల మార్గానికి పైకప్పు నిర్మించనున్నారు. మాఢవీధులకు మెట్లు నిర్మించేందుకు రూ.1.44 కోట్లను కేటాయించారు. మరో.. రూ.43.5 కోట్లతో దీక్షాపరుల మండపం, డార్మిటరీ హాల్స్ పనులకు కూడా సీఎం రేవంత్ రెడ్డి తాజాగా శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. ఇక వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు



నిర్వహించడానికి ప్రత్యేక యాగశాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు.



# 90 మంది ప్రాణాలు బుగ్గి

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్నట్టు సమాచారం. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, అక్కడ చిక్కుకున్న చాలా మందిని శనివారం ఉదయం నాటికి సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. గనిలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని అన్నారు. సంఘటనా స్థలంలో భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు, రెస్క్యూ సిబ్బంది మోహరించాయి. ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "అన్ని ప్రాంతాలు, విభాగాలు ఈ ప్రమాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. పని ప్రదేశ భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి భారీ ప్రమాదాలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు. ప్రాథమిక దర్యాప్తులో గనిలో కార్బన్ మోనాక్సైడ్ వాయువు స్థాయిలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు గుర్తించినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ వాయువు అత్యంత విషపూరితమైనది.



# ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేస్తూ.. తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఇక తాజాగా కేబినెట్ భేటీలో పలు ఉద్యోగుల భర్తీకి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొత్త పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులతోపాటు.. మరో 6 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాకుండా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టులను భర్తీ చేసేందుకు క్లియరెన్స్ ఇచ్చింది. వీటితో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫైర్‌స్టేషన్ కోసం ఇంకో 18 పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ అంగీకారం తెలిపింది.

### ఇందిరమ్మ ఇళ్లపై గుడ్ న్యూస్

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందించనుంది. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. ఈ వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. 'తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొలారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులందరూ అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాలన్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని తీర్మానించాం. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలన్నదే మా లక్ష్యం. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని డీసీఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకాలో విలినం చేయబోతున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయించాం. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026--30 ఆమోదించాం' అని మంత్రి పేర్కొన్నారు.

## 10 రోజుల్లో మూడోసారి!

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిన ముడిచమురు ధరల భారాన్ని చమురు కంపెనీలు దశలవారీగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా మే 15న లీటరుకు ఏకంగా రూ. 3 పెంచగా, మే 19న మరో 90 పైసలు పెంచారు. తాజా పెంపుతో కలిపి ఈ 10 రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ. 5 మేర పెరిగాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరలు భారీగా పెరిగాయి. కోల్‌కతాలో లీటరు పెట్రోల్ ధర రూ. 110.64, డీజిల్ రూ. 97.02గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ. 108.49, డీజిల్ రూ. 95.02కు చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ. 105.31, డీజిల్ ధర రూ. 96.98 వద్ద కొనసాగుతోంది. ఇక, తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 112.81కు చేరగా, లీటర్ డీజిల్ ధర రూ. 100.94కి పెరిగాయి. విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 113.53కు, లీటర్ డీజిల్ ధర రూ. 101.27కి చేరాయి.

## భారత్ మా టార్గెట్ కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవస్థను సంస్కరించాలని నిర్ణయించాం.. ఒక వ్యవస్థను సంస్కరించేటప్పుడు అంతరాయాలు, ఇబ్బందులు, అసౌకర్యాలు ఎదురవడం సహజం" అని పేర్కొన్నారు. ఇదే సమయంలో డొనాల్డ్ ట్రంప్ తరఫున మోదీని అమెరికాకు రూబియో ఆహ్వానించారు.

## థాయ్ 60 రోజుల ఫ్రీ వీసా రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం దృష్టి సారించింది. భారతీయుకు ఇది ఒక పెద్ద షాక్‌గానే చెప్పాలి. ఎందుకంటే జూలై 2024 లోనే ఈ 60 రోజుల ఉచిత వీసా సదుపాయాన్ని పొడిగించారు. థాయిలాండ్ విదేశాంగ శాఖ ప్రకారం... మే 19, 2026 న థాయిలాండ్ క్యాబినెట్ ఈ సవరించిన వీసా మినహాయింపు, 'వీసా ఆన్ అరైవల్' నిబంధనలకు ఆమోదం తెలిపింది. 'ఒకే దేశానికి ఒకే థాయ్ వీసా మినహాయింపు' అనే కొత్త విధానం ఆధారంగా ఇది పనిచేస్తుంది. విదేశీ పర్యాటకులకు మరింత స్పష్టమైన, స్థిరమైన ప్రమాణాలను ఏర్పాటు చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఇది ప్రతి దేశానికి లేదా ప్రాంతానికి ఒకే ఒక వీసా కేటగిరీని అనుమతిస్తుంది. దీంతో ఇప్పటి వరకు అన్ని దేశాలకు వర్తించే 60 రోజుల ఉచిత వీసా విధానం పూర్తిగా రద్దవుతుంది. అలాగే, 30 రోజుల వీసా మినహాయింపు దేశాల జాబితాను 57 నుంచి 54కి తగ్గించారు. మూడు దేశాల కోసం కొత్తగా 15 రోజుల వీసా ప్రోగ్రామ్ తీసుకొస్తున్నారు. 'వీసా ఆన్ అరైవల్' దేశాల సంఖ్య 31 ఉండగా.. వాటిని నాలుగు పరిమితం చేశారు. ఈ కొత్త నిబంధనలు అధికారికంగా 'రాయల్ గెజెట్'లో ప్రచురించి 15 రోజుల తర్వాత అమలులోకి వస్తాయి.

# ఠాణాల్లో ఏఐ కాపీ రైటర్

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు రికార్డర్ అయిన 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ బంజారాహిల్స్ టీజీఐసీసీసీలో శనివారం ఆవిష్కరించారు. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా 10 కిపైగా భాషల్లో కేసులను ఫిర్యాదు చేసే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఇక యాప్‌లో చెప్పిన విషయాలను వెంటనే టెక్ట్స్ రూపంలో మార్చుతుంది. అంతేకాకుండా ఒక భాష నుంచి మరో భాషకు ట్రాన్స్‌లేట్ చేస్తుందని తెలిపారు. ఇక ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసే సదుపాయం కూడా ఉందని వివరించారు. ఇతర రాష్ట్రాల ప్రజలు, వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు.. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా భారీ ఉపశమనం లభిస్తుందని చెప్పారు. బాధితులకు న్యాయం అందించడానికి భాష అడ్డు కాకూడదు అనే లక్ష్యంతో ఈ ఏఐ కాప్‌రైటర్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. మొదట హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగంతోపాటు..



కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో రూపొందించినట్లు చెప్పారు. ఫిర్యాదు నమోదు చేసే సమయంలో భాష పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురుకావడం.. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరగడం.. సమాచారం తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలకు ఈ యాప్‌తో చెక్ పెట్టనున్నారు. హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి 10 భారతీయ భాషల్లో మాట్లాడితే.. అది వెంటనే రాతపూర్వకంగా మార్చుతుంది. దీంతో కేసు నమోదు చేయడానికి ఇప్పటివరకు గంటల తరబడి సమయం పడితే.. ఈ ఏఐ కాప్‌రైటర్ క్షణాల్లోనే పని పూర్తి చేస్తుంది. ఫిర్యాదు రికార్డ్ చేసిన అధికారి వివరాలు, సమయం వంటి వివరాలన్నీ ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో రికార్డ్ అవుతాయి. దీంతో రికార్డులను తారుమారు చేసే అవకాశం కూడా ఉండదని సీపీ సజ్జనార్ తెలిపారు. పోలీసులకు కూడా టైపింగ్ భారం తగ్గడమే కాకుండా.. రికార్డులను కూడా ఈజీగా మెయింటైన్ చేయవచ్చని పేర్కొన్నారు.

## వడదెబ్బతో 16 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 18 జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు.. హైదరాబాద్ నగరంలోనూ 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వడగాలులపై హై అలర్ట్ ప్రకటించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రతకు సంబంధించి.. గంట గంటకు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎండదెబ్బకు గురైతే.. వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి.. అత్యవసర చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు.



## తెలంగాణ ఐపీఎల్!

# 8 జట్లతో టోర్నీ

### టీమ్‌లు.. యాజమాన్యాలు

హైదరాబాద్- 7.5 కోట్లు- ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్
రంగారెడ్డి- రూ.7.2 కోట్లు- బూరుగు ఇన్‌ఫ్రా, ప్రణవ
వరంగల్- రూ.6.55 కోట్లు- బైన్ గ్లోబల్ రిసోర్సెస్
మెదక్- రూ.6.33 కోట్లు- బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్
నల్లగొండ- రూ.5.06 కోట్లు- కిశోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్
కరీంనగర్- రూ.4.57 కోట్లు- ఈఐపీఎల్ గ్రూప్, తిబరుమాల్
మహబూబ్‌నగర్- రూ.4.5 కోట్లు- వీరభద్ర స్టీల్స్
ఖమ్మం- రూ.4.44 కోట్లు- అన్విత గ్రూప్



# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి: సీతక్క

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్యా పురోగతి, మహిళల జీవనోపాధి బలోపేతం వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా చేసుకుని ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహిళా వారోత్సవాల నిర్వహణ, కార్యక్రమాల షెడ్యూల్, ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా, సామాజికంగా మరింత శక్తివంతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంటును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లుగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా సంఘాల ఆర్థిక శక్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు అధికారులు వివరించారు. ఈ నెల 25న, నిర్మాణం పూర్తి చేసుకున్న 100 గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించనున్నారు. అదే రోజు రాష్ట్రంలోని 8 వేల గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 82 అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో లోన్ మేళాలు నిర్వహించనున్నారు. 26వ తేదీన మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 553 ఆర్టీసీ బస్సులను ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. హైదరాబాద్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ను ప్రారంభించనున్నారు. బాల్య వివాహం బతుకు ఆగం పేరుతో బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక



ప్రచారం, సామాజిక చైతన్య కార్యక్రమాలు, సోషల్ మొబిలైజేషన్ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. 27వ జిల్లా కేంద్రాల్లో మహిళా భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు, పోష్ చట్టంపై అవగాహన సదస్సులు, లోకల్ కమిటీలు (ఎల్సీలు), ఇంటర్నల్ కమిటీలు (ఐసీలు) కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28వ తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం లేదని అధికారులు తెలిపారు. 29వ తేదీన మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇన్క్యుబేటర్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మానవ అక్రమ రవాణా నిరోధక విధానాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లా స్థాయిలో మహిళా సంఘాల జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమాలు, మండల సమాఖ్యల్లో ప్రత్యేక సాధారణ సమావేశాలు నిర్వహించనున్నారు.



## 15 జిల్లాల్లో 45 డిగ్రీలు

**రాష్ట్రంలో సూర్య ప్రతాపం**

కొత్తగూడెం/జగిత్యాల, మే 23 (ఈవార్తలు): రాష్ట్రంలో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడిపోతున్నారు. మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఓ వైపు వేడిగాలులు వీస్తోంటే.. మరోవైపు ఉక్కపోత ఊపిరి సలపనివ్వడంలేదు. శనివారం రాష్ట్రంలో 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీలు దాటాయి. కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో అత్యధికంగా 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా.. అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ లో 46.2, సూర్యాపేటలో 46.2, ఖమ్మంలో 46.1, మంచిర్యాలలో 46.1, ములుగు 46, పెద్దపల్లి 45.9, భూపాలపల్లి 45.7, నల్గొండ 45.7, నిర్మల్ 45.5, నిజామాబాద్ 45.5, కరీంనగర్ 45.3, మహబూబాబాద్ 45.3, వరంగల్ 45.2, సిద్ధిపేట 45.1, హనుమకొండ 44.6, ఆదిలాబాద్ 44.5, రాజన్న సిరిసిల్ల 44.5, జనగామ 44, కామారెడ్డి 43.5, భువనగిరి 43.1, మెదక్ 42.4, హైదరాబాద్ 42.1, మేడ్చల్ మల్కాజిగిరి 42, రంగారెడ్డి 41.9, సంగారెడ్డి 41.8, నాగర్ కర్నూల్ 41.7, మహబూబ్ నగర్ 41.6, వనపర్తి 41.5, వికారాబాద్ 41.2, గద్వాల 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే వారంరోజుల్లో నార్త్, ఈస్ట్ తెలంగాణ జిల్లాల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వనపర్తి, గద్వాల, మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో 40 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, అక్కడక్కడా చిరుజల్లులు ఉపశమనాన్నిస్తాయని పేర్కొంది. హైదరాబాద్ లో మరికొద్దిరోజులపాటు 41, 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావొచ్చని, మే24, 25 తేదీల్లో మోస్తరు వర్షం కాస్త రిలీఫ్ ఇస్తుందని వెల్లడించింది.

## దోచుకోవడానికే కొత్త డీపీఆర్‌లు

**టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు**

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలకుల దారిలో నడుస్తోందనే భావన ప్రజల్లో బలపడుతోందని, కొత్త ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల డీపీఆర్‌లు తయారు చేస్తూ, ప్రజల సంక్షేమం కన్నా తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని మరింత అప్పుల బారిన పడేస్తూ, ప్రజలపై భారం మోపే పరిస్థితి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మక్క, జొన్నతో పాటు ఇతర పంటలను కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీలను నిలబెట్టుకోలేక రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరైన సమాచారం ఇవ్వకుండా, కొనుగోళ్లలో ఆలస్యం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులను మోసం చేయడం మానుకొని, రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మోసపూరిత రాజకీయాలను ఇక నమ్మవద్దని కోరారు. ప్రధాని మోడీ 12 ఏళ్లుగా దేశానికి నిజాయితీ, అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి ఒక అవకాశం ఇస్తే పారదర్శకతతో కూడిన, అవినీతి రహితమైన, ప్రజల సంక్షేమాన్ని ముందుంచే పరిపాలన అందిస్తామన్నారు.

## 25 నుంచి రైతు గోస.. బీజేపీ భరోసా

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): రాష్ట్రంలో ఈనెల 25 నుంచి రైతు గోస– బీజేపీ భరోసా పేరిట కాషాయం పార్టీ యాత్రకు ఏర్పాట్లు చేసింది. మొదటి రోజు తాండూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రం దర్శించి అదే రోజు రాత్రి గజ్వేల్‌చేరుకుని బస చేస్తారు. రెండవ రోజు గజ్వేల్ నుంచి భువనగిరి, వరంగల్ వెళ్లి రాత్రి భూపాలపల్లిలో ఉంటారు. మూడు రోజు భూపాలపల్లి నుంచి కాటారం, మంథని, రాత్రి పెద్దపల్లి జిల్లాలో పోరుబాట నిర్వహించనున్నట్లు ఆపార్టీ శనివారం ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎంపీలు, ఎమ్మెల్యేలు. ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారికి ధాన్యం అమ్మకాల్లో ఎదురైె సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం 10 గంట నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ అధ్యక్షులు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది.

# ది బెస్ట్ పీసీసీ చీఫ్ నేనే

**మహేశ్ కుమార్ గౌడ్**



హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): తనపై వస్తున్న ఆరోపణలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సరైన సమయంలో అందరికీ సమాధానం తెలుస్తుందని, టీపీసీసీ మార్పు విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. తాను సరైన వ్యక్తిని అనే తనకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చారని, ఏఐసీసీ దృష్టిలో తాను బెస్ట్ పీసీసీ చీఫ్ అని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తనను అనేకసార్లు అభినందించారని, తాను, సీఎం కలిసి పని చేయడం కొందరికి మింగుడుపడడం లేదని ఆయన ఆరోపణలు గుప్పించారు. తనపై వచ్చిన కథనాలను తాను పట్టించుకోనని, అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ మీడియాకి ఉందన్నారు. చిన్నాచితక విషయాలపై తన సమయాన్ని వెచ్చించనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గాంధీ భవన్ ట్రస్ట్ వాళ్ళదని, తనపై ఒక ఛానెల్ ప్రచారం చేస్తే అది ప్రామాణికం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. తన పనితీరుని బేరీజు వేయాల్సింది సీఎం, తన పార్టీ కార్యకర్తలని, తాను పత్రిక స్వేచ్ఛను అర్థం చేసుకున్న వ్యక్తిని అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అన్నింటికి కాలమే సమాధానం చెపుతుందని ఆయన అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఏఐసీసీకి పంపించామని, త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుంటారని, విస్తరణలో తన ప్రమేయం ఏముందదని ఆయన స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచి గా మారుతుందని, సిటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుంది.. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీష్ రావు అంటున్నారా? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ కు దూరదృష్టి లేదు హైదరాబాద్ పరిధిని పెంచలేదని, తెలంగాణపై కేంద్రం సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆయన ఆరోపించారు. స్టాలిన్ లాగే తాము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు.

# మోకిల విల్లా.. బిల్డర్‌కు షాక్

**వడ్డీతో కలిపి రూ.1.08 కోట్లు రిఫండ్ చేయాలని ఆదేశం**

**హైదరాబాద్ దంపతులకు భారీ ఊరట**

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లో విల్లా కొనుగోలు చేసిన దంపతులకు తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ భారీ ఊరటనిచ్చింది. నగర శివార్లలోని మోకిల సమీపంలో ఓ విల్లా ప్రాజెక్టులో నిర్మాణం ప్రారంభించకుండా ఒప్పందాన్ని ఉల్లంఘించిన బిల్డర్‌కు గట్టి షాకిచ్చింది. కొనుగోలుదారులకు చెల్లించిన పూర్తి మొత్తం రూ.1.08 కోట్లను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశిస్తూ కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన కోకా శ్రీకృష్ణపాత్రులు, ఆయన భార్య రంగారెడ్డి జిల్లా, శంకరపల్లి మండలం, మోకిలలోని 'సార్క్ ప్రైమ్ నార్త్ మెడోస్-2' ప్రాజెక్టులో ఓ విల్లాను బుక్ చేసుకున్నారు. 2,600 చదరపు అడుగుల



విస్తీర్ణంలో ఉన్న ఈ విల్లా కోసం వారు మొత్తం రూ.1.08 కోట్లు చెల్లించారు. 2021 మార్చిలో బిల్డర్‌తో ఒప్పందం చేసుకున్న ఈ దంపతులు, 2022 నాటికి పూర్తి మొత్తం చెల్లించారు. ఒప్పందం ప్రకారం 36 నెలల నిర్మాణ కాలపరిమితి, 6 నెలల గ్రేస్ పీరియడ్‌తో కలిపి 2024 సెప్టెంబర్ నాటికి విల్లాను అప్పగించాల్సి ఉంది. అయితే, గడువు సమీపించినా బిల్డర్ కనీసం నిర్మాణ పనులు కూడా ప్రారంభించలేదు. దీంతో బాధితులు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన కమిషన్, బిల్డర్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టింది. నిర్మాణ పనులు ప్రారంభించకపోవడానికి సరైన కారణాలు చూపలేదని, హెచ్ఎండీఏ అనుమతులు లేదా ఇతర సమస్యలపై ఆధారాలు సమర్పించలేదని పేర్కొంది. ఏకపక్ష ఒప్పందాలతో వినియోగదారులను నిరవధికంగా వేచి ఉండేలా చేయడం సరికాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, దంపతులకు అసలు మొత్తం రూ.1.08 కోట్లను 12 శాతం వడ్డీతో పాటు తిరిగి చెల్లించాలని బిల్డర్‌ను ఆదేశించింది. అంతేకాకుండా, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.3 లక్షల నష్టపరిహారం, కేసు ఖర్చుల కింద మరో రూ.15,000 చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

# బీఆర్ఎస్ నేత దారుణ హత్య

**సూర్యాపేట జిల్లాలో మరో రాజకీయ హత్య**

**పాత రాజకీయ కక్షలే కారణమని పోలీసుల అంచనా**

సూర్యాపేట, మే 23 (ఈవార్తలు): సూర్యాపేట జిల్లాలో రాజకీయ కక్షలు మరోసారి రక్తపాతం సృష్టించాయి. యర్కారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ సర్పంచ్ చింతలపాటి మధును గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మధును గ్రామంలోనే హత్య చేసి, మృతదేహాన్ని మూడు ముక్కలుగా నరికి మూడు గోనె సంచుల్లో కట్టి గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఎస్పీ కాలువలో పడేసి దుండగులు పరారయ్యారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో పాత రాజకీయ వైషమ్యాలే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం జరిగిన అప్పటి సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో చింతలపాటి మధు ప్రధాన నిందితుడుగా ఉన్నారు. ఈ ఘటనతో యర్కారం గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.

## సీఏలదే భవిష్యత్తు: కేటీఆర్

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు. సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. ముమ్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## కారుతో ఢీకొట్టి న్యాయవాది హత్య!

**హైదరాబాదులోని మాసాబ్ ట్యాంక్ సమీపంలో ఘటన**

**తొలుత హిట్ అండ్ రన్ కేసుగా నమోదు**

**వక్ఫ్ భూముల వివాదంతోనే హత్య: పోలీసులు**

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ సమీపంలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌ను ఒక కారు ఢీకొట్టింది. ఆయన కారు ఎక్కుతున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొట్టింది. ఆ తర్వాత ఢీకొట్టిన కారు అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఖాజా మొయినుద్దీన్‌ను ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొన్ని గంటలకే మృతి చెందారు. మొదట ఈ ఘటనను పోలీసులు హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేశారు. ఆ తర్వాత పోలీసులు ఈ హిట్ అండ్ రన్ కేసుపై అనుమానాలు వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు భూముల వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఖాజా మొయినుద్దీన్ స్నేహితుడు అడ్వకేట్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, రెక్కీ నిర్వహించి అతనిని కారుతో ఢీకొట్టి హత్య చేశారని ఆరోపించారు. నెంబర్ ప్లేట్ లేని కారుతో ఢీకొట్టారని వెల్లడించారు. మలక్‌పేటలోని వక్ఫ్ ఆస్తులు, భూములకు సంబంధించి ఇద్దరితో వివాదం కొనసాగుతున్నట్లు తెలిపారు. గతంలో కూడా నిందితులు ఆయనకు హాని తలపెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. వీరిద్దరిపై ఖాజా మొయినుద్దీన్ గతంలో హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాడు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండుకు తరలించారు. ఆయన చనిపోవడానికి కొద్దిసేపటి ముందు తనతో మాట్లాడారని తెలిపారు. ఆయన ఎక్కువగా వక్ఫ్ భూముల తగాదా కేసులను వాదిస్తారని తెలిపారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
| --- | --- | --- |
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines - Rs.450 (for each extra line - Rs.90)

COLOUR: Price for 5 Lines - Rs.500 (for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com

ఈవార్తలు




# ఇన్సూరెన్స్‌ల మోసాలు

**రూమ్ రెంట్ పరిమితి దాటితే మొత్తం బిల్లుపై కోతలు.. అదే వ్యాధికి మళ్లీ చికిత్స తీసుకుంటే రీస్టోరేషన్ వర్తించదు**

**కో-పేమెంట్, వెయిటింగ్ పీరియడ్‌లతో భారాలు**

**(ఈవార్తలు స్పెషల్ డెస్క్)**

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రస్తుతం 'అన్‌లిమిటెడ్ కవర్', 'అన్‌లిమిటెడ్ రీస్టోర్', '100% ప్రొటెక్షన్' వంటి ఆకర్షణీయమైన పదాలతో పాలసీలను ప్రచారం చేస్తున్నాయి. అయితే, ఇవి ఎక్కువగా వినియోగదారులను ఆకట్టుకునే మార్కెటింగ్ వ్యూహాలేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. పాలసీ పత్రాల్లోని సన్నని అక్షరాల్లో ఉన్న నిబంధనలను చాలామంది పట్టించుకోకపోవడంతో, క్లెయిమ్ సమయంలో అసలు పరిమితులు బయటపడుతున్నాయి. పాలసీల్లో సాధారణంగా 'సింగిల్ ఏసీ రూమ్ వరకు మాత్రమే' లేదా 'రోజుకు నిర్దిష్ట మొత్తమే' అనే పరిమితి ఉంటుంది. ఈ పరిమితిని మించి ఖరీదైన గదిలో చేరితే కేవలం గది అద్దెకే కాదు, సర్జన్ ఫీజులు, ఐసీయూ చార్జీలు, ఆపరేషన్ థియేటర్ ఖర్చులు, మందుల బిల్లులపై కూడా దామాషా పద్ధతిలో కోత విధిస్తారు. ఉదాహరణకు రూ.5 వేల రూమ్ అర్హత ఉన్న పాలసీతో రూ.10 వేల గదిలో చేరితే మొత్తం బిల్లులో 30 నుంచి 50 శాతం వరకు భారం పాలసీదారుడిపైనే పడే అవకాశం ఉంటుంది. 'అన్‌లిమిటెడ్ రీస్టోర్' పేరుతో బీమా మొత్తం తిరిగి వస్తుందని ప్రచారం చేసినా, చాలాసార్లు అది వేరే వ్యాధికి మాత్రమే వర్తిస్తుంది. అంటే, ఒకసారి గుండె సంబంధిత వ్యాధికి మొత్తం బీమా వినియోగిస్తే, అదే సమస్య మళ్లీ వస్తే రీస్టోర్ ప్రయోజనం ఉండకపోవచ్చు. కేన్సర్, కిడ్నీ వ్యాధులు, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక సమస్యలున్న వారికి ఇది పెద్ద ప్రమాదంగా మారుతోంది. చాలా పాలసీల్లో 'కో-పేమెంట్' నిబంధన ఉంటుంది. అంటే ఆసుపత్రి బిల్లులో 10% నుంచి 30% వరకు పాలసీదారుడే చెల్లించాలి. వృద్ధులకు ఇచ్చే పాలసీల్లో ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. అలాగే కంటి శుక్లాలు, మోకాలి మార్పిడి, ప్రసూతి చికిత్స, డెంటల్ ప్రక్రియలు వంటి వాటికి ప్రత్యేక పరిమితులు విధిస్తారు. పాలసీ మొత్తం రూ.10 లక్షలు ఉన్నా, కొన్ని చికిత్సలకు కేవలం రూ.40 వేల నుంచి రూ.1 లక్ష వరకే చెల్లించే పరిస్థితి ఉంది. కొత్తగా పాలసీ తీసుకున్న వెంటనే అన్ని వ్యాధులకు కవరేజీ ఉండదు. షుగర్, బీపీ, థైరాయిడ్, గుండె సమస్యలు వంటి ముందస్తు వ్యాధులకు 2 నుంచి 4 ఏళ్ల వరకు వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. ఈ విషయం చాలామంది గుర్తించకపోవడంతో క్లెయిమ్ తిరస్కరణలు ఎదురవుతున్నాయి.




**పెరుగుతున్న క్లెయిమ్‌ల తిరస్కరణలు**

బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ గణాంకాల ప్రకారం, 2024 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య బీమా క్లెయిమ్ తిరస్కరణలు గణనీయంగా పెరిగాయి. సుమారు రూ.26 వేల కోట్ల క్లెయిమ్‌లు వివిధ కారణాలతో నిలిచిపోయినట్లు సమాచారం. తప్పుడు సమాచారం ఇవ్వడం, నిబంధనలు అర్థం చేసుకోకపోవడం, ముందస్తు వ్యాధులను వెల్లడించకపోవడం ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. 'అన్‌లిమిటెడ్' అనే పదాన్ని నమ్మి తొందరపడి పాలసీ కొనుగోలు చేయకూడదని ఆర్థిక సలహాదారులు సూచిస్తున్నారు. తక్కువ ప్రీమియం కోసం కీలక ప్రయోజనాలను వదులుకుంటే, అత్యవసర సమయంలో భారీ ఆర్థిక భారం తప్పదని హెచ్చరిస్తున్నారు. పాలసీ పత్రాలను పూర్తిగా చదివి, అవసరమైతే నిపుణుల సలహాతో సరైన బీమాను ఎంపిక చేసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

**ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..**

- రూమ్ రెంట్‌పై పరిమితి ఉందా?
- రీస్టోరేషన్ అదే వ్యాధికి వర్తిస్తుందా?
- కో-పేమెంట్ శాతం ఎంత?
- సబ్-లిమిట్లు ఏ చికిత్సలకు ఉన్నాయి?
- వెయిటింగ్ పీరియడ్ ఎంతకాలం?
- నెట్‌వర్క్ ఆసుపత్రుల జాబితాలో మీ నగరంలోని ఆసుపత్రులు ఉన్నాయా?
- డే-కేర్, హోమ్ ట్రీట్మెంట్ కవరేజీ ఉందా?

# మళ్లీ ఇరాన్ గగనతలం క్లోజ్

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై 'కొత్త దాడులు' చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. సీబీఎస్ న్యూస్ కథనం ప్రకారం రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. అయితే, దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా ఆ కథనం పేర్కొంది. ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు. ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. "ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యం" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీరతను తెలియజేస్తోంది. గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.





## ఉగ్రవాది అంత్యక్రియలకు టాప్ టెర్రరిస్టులు

**హిజ్బుల్ చీఫ్ సలావుద్దీన్, అల్-బద్ర్ చీఫ్ జమీన్ ఖాన్ హాజరు**

ఇస్లామాబాద్: ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని పాకిస్థాన్ చెప్పే మాటలు మరోసారి నీటిమూటలయ్యాయి. ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులకు పాకిస్థాన్ సురక్షితమైన అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇస్లామాబాద్‌లోనే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల హతమైన ఓ ఉగ్రవాది అంత్యక్రియలకు అనేక మంది టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరై, పాకిస్థాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించారు. వివరాల్లోకి వెళితే, నిషేధిత అల్-బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్, 'డాక్టర్' అనే కోడ్‌నేమ్‌తో పనిచేసిన అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని మృతదేహానికి ఇస్లామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాచే ఉగ్రవాదిగా ప్రకటించబడిన హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్-బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ వంటి కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా బఖ్త్ జమీన్ ఖాన్ చుట్టూ ఏకే-47 వంటి ఆధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. ఇటీవల కాలంలో పాకిస్థాన్‌లో వరుసగా ఉగ్రవాదులు గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమవుతున్న నేపథ్యంలో, తమ నేతల భద్రతపై ఉగ్రవాద సంస్థలు ఆందోళన చెందుతున్నాయని ఈ ఘటన తెలియజేస్తోంది. ఈ హత్యల పరంపర ఉగ్రవాదుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు సమాచారం.

## నీట్ 2026 ఫీజు రిఫండ్ ప్రారంభం

న్యూఢిల్లీ: రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించి విద్యార్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. పరీక్ష ఫీజు వాపసు కోసం ప్రత్యేకంగా ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఫీజు చెల్లించిన అర్హులైన అభ్యర్థులు తమ బ్యాంకు ఖాతా వివరాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా సమర్పించి, రిఫండ్ పొందవచ్చని తెలిపింది. ఈ ప్రక్రియ ఈ నెల 22న ప్రారంభం కాగా, 27లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు నమోదు చేసిన బ్యాంకు ఖాతాకు ఫీజు నేరుగా బదిలీ చేయబడుతుంది. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.




# జేఈఈ, నీట్ విలీనం?

**పేపర్ లీక్ వివాదం వేళ కేంద్రం యోచన**

**ఒకే ప్రవేశ పరీక్షతో ఇంజినీరింగ్, మెడికల్ సీట్ల భర్తీ**

**మాజీ ఇస్రో చీఫ్ రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులపై చర్చ**

న్యూఢిల్లీ: దేశంలో ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఒకే జాతీయ ప్రవేశ పరీక్షను నిర్వహించే అవకాశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో పరీక్షల సంస్కరణలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీకి అధికారులు ఈ ప్రతిపాదనను సమర్పించారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణను మరింత పటిష్ఠం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇస్రో మాజీ చీఫ్ డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీని ప్రకారం జేఈఈ, నీట్ పరీక్షలను ఒకే ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్ కిందకు తీసుకువస్తారు. విద్యార్థులు ఒకే సాధారణ పరీక్ష రాస్తారు. అందులోనే ఇంజినీరింగ్ కోసం మ్యాథ్స్ విభాగం, మెడికల్ అభ్యర్థుల కోసం బయాలజీ విభాగాలను ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ కొత్త విధానంతో పాటు భవిష్యత్తులో నీట్ అభ్యర్థులకు కఠినమైన అర్హత నిబంధనలను తీసుకురావాలని పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించింది. పరీక్ష రాయడానికి గరిష్ఠ ప్రయత్నాల సంఖ్య, అలాగే వయోపరిమితిని విధించాలని యోచిస్తోంది. దీనివల్ల మెడికల్ ప్రవేశ పరీక్ష కూడా ఇతర జాతీయ స్థాయి పోటీ పరీక్షల తరహాలోనే క్రమశిక్షణతో కూడిన నిర్మాణాన్ని సంతరించుకుంటుందని భావిస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణల వల్ల నీట్-యూజీ 2026 పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషి పరీక్షల ప్రక్రియను ప్రక్షాళన చేయడానికి తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు. భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా చర్చించారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టడానికి ఎన్‌టీఏ కొన్ని కీలక మార్పులు చేస్తోంది. పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే పరీక్షల నిర్వహణ కోసం థర్డ్-పార్టీ ఏజెన్సీలపై ఆధారపడటాన్ని తగ్గించి, సొంత సాంకేతిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవాలని చూస్తున్నారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష రద్దు కాగా జూన్ 21న కట్టుదిట్టమైన భద్రతతో తిరిగి పరీక్ష నిర్వహించనున్నారు.

# రాజ్యసభలో టీవీకే తొలి అడుగు!

**సీఎం విజయ్ ప్రభుత్వానికి తొలి పరీక్ష**

చెన్నై: తమిళనాడులో కొత్తగా అధికారంలోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి తొలి రాజకీయ పరీక్ష ఎదురుకానుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 18న ఈ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి రాజ్యసభ ఎన్నిక కావడంతో దీనిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి సీవీ షణ్ముగం ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కాగా, జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు ఇచ్చారు. జూన్ 18న పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. తమిళనాడు అసెంబ్లీలో ప్రస్తుతం 233 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభ స్థానాన్ని గెలుచుకోవాలంటే ఒక అభ్యర్థికి 117 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఏ ఒక్క పార్టీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేనందున, అధికార కూటమి బలాబలాలపైనే ఫలితం ఆధారపడి ఉంది. ప్రస్తుతం సంఖ్యాపరంగా టీవీకే నేతృత్వంలోని కూటమికి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. దీంతో ఈ సీటును వారే గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.



# భవిష్యత్తులో సైబర్ యుద్ధాలే

**కాగ్నిటివ్ వంటి వార్‌లూ తప్పవు.. సీడీఎస్ అనిల్ చౌహాన్**

షిర్డీ: భవిష్యత్తులో జరిగే యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, వాటితో పాటు సైబర్‌స్పేస్, కాగ్నిటివ్ (జ్ఞాన) రంగాల్లోనూ జరుగుతాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. శనివారం మహారాష్ట్రలోని షిర్డీలో ఎన్ఐబీఈ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధాలు సంప్రదాయ బలగాలపై మాత్రమే ఆధారపడి ఉండవని జనరల్ చౌహాన్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, డ్రోన్లు, సైబర్ వ్యవస్థల వంటి అధునాతన సాంకేతికతలు భవిష్యత్ యుద్ధ క్షేత్రాన్ని నిర్దేశిస్తాయని వివరించారు. "యుద్ధభూమి ఇకపై భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాదు. సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ వ్యవస్థలు కూడా అందులో భాగమే" అని ఆయన తెలిపారు. సాంకేతిక ఆవిష్కరణ, వేగవంతమైన అనుసరణ సామర్థ్యమే భవిష్యత్ ఘర్షణల్లో వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు షిర్డీ విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి చెందిందని, నేటి నుంచి రక్షణ తయారీ, పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు కూడా కేంద్రంగా గుర్తింపు పొందుతుందని జనరల్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది విశ్వాసం, భవిష్యత్ సాంకేతికతల అద్భుతమైన కలయిక అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా దేశీయ రక్షణ తయారీ రంగం గణనీయమైన వృద్ధిని సాధించిందని సీడీఎస్ గుర్తుచేశారు. ప్రస్తుతం దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ సుమారు రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, రక్షణ ఎగుమతులు రూ.38,000 కోట్లు దాటాయని వెల్లడించారు. 100కు పైగా దేశాలకు భారత రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు.

# తమిళనాడులో పదేళ్ల బాలిక హత్య

**కోయంబత్తూర్‌లో ఘటన.. కిరాణా సామాన్లకు వెళ్లిన చిన్నారి కిడ్నాప్, హత్య**

**నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం విజయ్**

కోయంబత్తూర్: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఘోరం జరిగింది. సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన పదేళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఆపై ఆ చిన్నారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. శుక్రవారం చెరువు సమీపంలో మృతదేహం దొరికింది. ఈ ఘటనపై తమిళనాడు కొత్త సీఎం విజయ్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. "ఈ ఘోర ఘటన దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. ఇలాంటి అమానవీయ నేరాలను సహించబోం. కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్రంగా విచారణ జరిపి తక్షణమే చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించాం. మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘోరాలకు ఒడిగట్టే వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుంది" అని విజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ హత్య రాష్ట్రంలో పెద్ద రాజకీయ దుమారం రేపింది. కొత్త ప్రభుత్వంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. సీఎం విజయ్ పదవి చేపట్టిన 12 రోజుల్లోనే నేరాలు పెరిగాయని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. మరోవైపు గత డీఎంకే ప్రభుత్వమే వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీ విమర్శించింది. ఈ కేసులో కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణను వేగవంతం చేయడానికి తమిళనాడు డీజీపీ స్వయంగా కోయంబత్తూర్ వెళ్లారు. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసుపత్రికి వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.


# దేశంలో 40% ఫేక్ న్యాయవాదులే!

**నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో ప్రాక్టీస్**

**డిగ్రీల వెరిఫికేషన్‌కు లాయర్లు దూరం: బీసీఐ**

న్యూఢిల్లీ: దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీవారేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా.. దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు. సోషల్ మీడియాలో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన 'కాక్రోచ్' వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.

# ఇవాంకా హత్యకు ఇరాన్ కుట్ర?



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్‌ను హత్య చేయడానికి కుట్ర జరిగినట్లు అగ్రరాజ్య మీడియా వెల్లడించింది. ఇరాన్ అండతో నడిచే ఓ ఉగ్రవాద సంస్థ ఈ ఘాతుకానికి వ్యూహం రచించినట్లు సమాచారం. 2020లో అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో ఇరాన్ సైనిక కమాండర్ ఖాసిం సులేమానీ మరణించిన సంగతి తెలిసిందే. దానికి ప్రతీకారంగానే ట్రంప్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కుట్రకు సూత్రధారిగా భావిస్తున్న 32 ఏళ్ల ఇరాకీ జాతీయుడు మహ్మద్ బాకర్ సాద్ దావూద్ అల్-సాదీని మే 15న టర్కీలో అరెస్ట్ చేసి అమెరికాకు అప్పగించారు. నిందితుడి వద్ద ఇవాంకా ట్రంప్‌కు చెందిన ఫ్లోరిడా ఇంటి బ్లూప్రింట్ లభించినట్లు సమాచారం. గతంలోనే అతడు ఇవాంకా ఇంటి మ్యాప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. "మీ భవనాలు, సీక్రెట్ సర్వీస్ మిమ్మల్ని రక్షించలేవు" అంటూ అరబిక్‌లో హెచ్చరించినట్లు నివేదికలు చెబుతున్నాయి. అమెరికా నిఘా వర్గాల కథనం ప్రకారం అల్-సాదీ కేవలం ఇవాంకా హత్యకు ప్లాన్ వేయడమే కాకుండా.. యూరప్, అమెరికాల్లోని పలు సంస్థలపై జరిగిన దాదాపు 18 దాడుల వెనుక ఉన్నట్లు అనుమానిస్తున్నారు. లండన్‌లో యూదులపై దాడి, టొరంటోలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల జరిగిన కాల్పుల ఘటనల్లో కూడా ఇతని ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ నిందితుడిని బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఒంటరి జైలు గదిలో ఉంచి విచారిస్తున్నారు. ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ కుట్ర బయటపడటం అంతర్జాతీయంగా సంచలనం రేపుతోంది.

# 1800 ఈత, తాటి చెట్లు బూడిద

**ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.. మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్**

మల్యాల, మే 23 (ఈవార్తలు): అగ్నిప్రమాదంతో ఉపాధి కోల్పోయిన గౌడ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మల్యాల మండలంలోని తక్కల్లపెల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 1800 ఈత, తాటిచెట్లతో పాటు రైతుల గడ్డివాములు కూడా అగ్నికి ఆహుతి కావడంతో శనివారం బాధిత గౌడ కుటుంబాలు, రైతులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈత వనాలపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 150 గౌడ కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు పూర్తిగా కాలిపోవడంతో అనేక కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాలపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించి బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గౌడ సంఘ సొసైటీలకు కొత్త ఈత చెట్లు మంజూరు చేసి తాటివనాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని



కోరారు. గతంలో కె. చంద్రశేఖర్ రావు ప్రభుత్వం గౌడలకు పన్నుల రద్దు, ప్రమాద బీమా వంటి చర్యలతో అండగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం గౌడల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎండాకాలంలో తరచూ ఈతవనాలు అగ్నికి ఆహుతవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని, కలెక్టర్, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బాధిత కుటుంబాలకు రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

# ధర్మపురిలో చైన్ స్నాచర్ అరెస్ట్

**2 తులాల పుస్తెల తాడు, సెల్‌ఫోన్ స్వాధీనం**

ధర్మపురి, మే 23 (ఈవార్తలు): ధర్మపురి పట్టణంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రెండు తులాల పుస్తెల తాడు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మపురి పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏప్రిల్ 2న ధర్మపురి పట్టణంలోని కోనేరు వద్ద మాదాసు గుండమ్మ అనే మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు, అనుమానితుడి ఫోటోలను సోషల్




మీడియా ద్వారా ప్రజలకు పంపించి సమాచారం సేకరించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో సంచరిస్తున్న తిప్పని అంజన్నను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన పుస్తెల తాడుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో సహకరించిన వేముల సంతోష్, అప్పం రాజన్న, చీర్ల నర్సవ్వలను ఎస్సై అభినందించారు. ఈ సందర్భంగా జి. మహేష్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును త్వరగా ఛేదించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై జీ మహేష్‌తో పాటు ధర్మపురి పోలీస్ సిబ్బందిని పురుషోత్తం రెడ్డి అభినందించారు.

# 117 మొబైళ్ల రికవరీ

**బాధితులకు అందజేసిన జగిత్యాల ఎస్పీ**

**సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచన**

జగిత్యాల, మే 23 (ఈవార్తలు): సెల్‌ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 117 మొబైల్ ఫోన్లను (సుమారు రూ.23 లక్షల విలువ) బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తే సాంకేతిక ఆధారాలతో వాటిని గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోయిన మొబైళ్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,838 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు




వెల్లడించారు. మొబైల్ ఫోన్ పోయినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. అటు.. సాంకేతికత పెరిగే కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సాంకేతికతను వినియోగించి మొబైళ్లను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన సీఈఐఆర్ బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, సైబర్ క్రైమ్ ఎస్సై దినేశ్, సీఈఐఆర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# 6 గంటల్లోనే దొంగను పట్టేశారు!

**బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్ట్**

జగిత్యాల టౌన్, మే 23 (ఈవార్తలు): జగిత్యాల కొత్త బస్టాండ్‌లో మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను చోరీ చేసిన కేసును టౌన్ పోలీసులు ఆరు గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జరినా బేగం తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో శుక్రవారం ఉదయం సుమారు 6 గంటలకు జగిత్యాల న్యూ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో ఆమె వద్ద ఉన్న సుమారు 22 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టౌన్ ఎస్సై ఎం. సుప్రియ వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. టౌన్ సీఐ పి. కరుణాకర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఘటన జరిగిన ఆరు గంటల వ్యవధిలోనే అరికెళ్ల అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. కేసును వేగంగా ఛేదించిన




కానిస్టేబుళ్లు జీవన్, చంద్రశేఖర్‌ను టౌన్ సీఐ పీ కరుణాకర్, పురుషోత్తం రెడ్డి అభినందించారు.

## కేసీఆర్ రైతుబంధు.. కాంగ్రెస్ రాబంధు: దావ వసంత

రాయికల్, మే 23 (ఈవార్తలు): రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కల్లాల్లో ధాన్యం పేరుకుపోయిందని



ఆరోపించారు. రైతులు కొనుగోళ్లు చేపట్టాలని ఆందోళన చేసినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులను ఆదుకున్న ఘనత కె. చంద్రశేఖర్ రావుకు దక్కుతుందని, రైతు సంక్షేమానికి ఆయన అనేక పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు పంట పండించడం ఒక ఎత్తయితే, దాన్ని విక్రయించడం మరో సమస్యగా మారిందన్నారు. అలాగే రైతులను ఆదుకుంటామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు పూర్తిగా అందలేదని, చేతికి వచ్చిన పంటను కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుని, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బర్కాం మల్లేశ్, ఆనంద్ రావు, సుధాకర్, ప్యాక్స్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా దూమల

జగిత్యాల, మే 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా దూమల రాజ్ కుమార్ను నియమిస్తూ శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా



జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం దూమల రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డా. సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ముఖ్యంగా ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



## కొండగట్టు నిత్యాన్నసత్రానికి రూ.లక్ష విరాళం

మల్యాల, మే 23 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడకు చెందిన ఉప్పు కిరణ్ - శ్రీలత దంపతులు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం దంపతులు అంజన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నదానం కోసం రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ప్రధాన అర్చకుడు శ్రీమారుతీప్రసాద్.. వారికి శేష వస్త్రం కప్పి లడ్డూ ప్రసాదం అందజేశారు.

## గంగాధర డిగ్రీ కాలేజీకి 29 పోస్టులు

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి**



గంగాధర, మే 23 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం భారీగా ఉద్యోగ పోస్టులను మంజూరు చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం తెలిపారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మొత్తం 29 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీతో గంగాధర పరిసర ప్రాంతాల గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుతుందని, నియోజకవర్గ విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ పోస్టులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు అని సత్యం వెల్లడించారు.

**మంజూరైన పోస్టుల వివరాలు:**

- రెగ్యులర్ టీచింగ్ పోస్టులు: 20 (అధ్యాపక పోస్టులు)
- నాన్-టీచింగ్ పోస్టులు: 6 (కార్యాలయ సిబ్బంది)
- అవుట్‌సోర్సింగ్ పోస్టులు: 3 (సహాయక సిబ్బంది)

## బీసీ-ఎస్సీ హాస్టల్‌కు మోక్షమెప్పుడు?: బీఆర్ఎస్



పెగడపల్లి, మే 23 (ఈవార్తలు): పెగడపల్లి మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దాదాపు రూ.2 కోట్లతో మంజూరు చేసిన బీసీ-ఎస్సీ హాస్టల్ పనులను కాంగ్రెస్ సర్కారు మూలనపడేసిందని బీఆర్ఎస్ నేత మడిగెల తిరుపతి ఆరోపించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలని, వెంటనే పనులను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.



## అంజన్న సేవలో జగిత్యాల ఎస్పీ

మల్యాల, మే 23 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు. శనివారం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆహ్వానించారు. అనంతరం ఎస్పీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు మారుతీప్రసాద్ ఎస్పీకి శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, ఎస్సై నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ప్రశిక్షణ మహా అభియాన్ శిబిరం

**బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి**

జగిత్యాల, మే 23 (ఈవార్తలు): పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026 కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రశిక్షణ శిబిరంలో జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లె గంగారెడ్డి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుతో కలిసి శిబిరంలో పాల్గొని పార్టీ కార్యకర్తలకు పలు అంశాలపై సూచనలు చేశారు. ప్రశిక్షణ శిబిరాల ద్వారా పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించుకోవచ్చని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**మొదలైన దరఖాస్తుల ప్రక్రియ**

తిరుమల, మే 23 (ఈవార్తలు): విద్యార్థులకు తిరుమల తిరుపతి దేవస్థానం తీపికబురు వినిపించింది. టీటీడీ విద్యాసంస్థలలో విద్యార్థులకు ప్రవేశాలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. దేశవ్యాప్తంగా టీటీడీకి 33 విద్యాసంస్థలు ఉన్నాయి. తిరుమల, తిరుపతితో పాటుగా పలుచోట్ల ఈ విద్యాసంస్థలను టీటీడీ నిర్వహిస్తోంది. ఈ విద్యాసంస్థలలో సుమారుగా 24,750 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ విద్యాసంస్థలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. మరోవైపు ఇంటర్మీడియట్ కోర్సుకు సంబంధించి టీటీడీ విద్యాసంస్థలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. టీటీడీకి తిరుపతిలో ఎస్వీ జూనియర్ కాలేజీ, ఎస్వీ మహిళా జూనియర్ కాలేజీ, ఎస్వీ ఓరియంటల్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లో ఇంటర్ చదివేందుకు ప్రస్తుతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మే 31వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయి. మార్కుల ఆధారంగా ఈ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు. ఎస్వీ జూనియర్ కాలేజీలో 792 సీట్లు, ఎస్వీ మహిళా జూనియర్ కళాశాలలో 968 సీట్లు, ఎస్వీ ఓరియంటల్ కాలేజీలో 180 సీట్లు ఉన్నాయి. జూన్ 1 నుంచి ప్రవేశాలు ప్రారంభం కానుండగా.. అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. వేంకటేశ్వర శిల్ప కళాశాలలోనూ ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఆలయ నిర్మాణం,చిత్రలేఖనం, కలంకారి వంటి పలు విభాగాల్లో డిప్లొమా చదివేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. దరఖాస్తు చేసుకునేందుకు పది పాసై ఉండాలి. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తున్నారు. వేంకటేశ్వర శిల్ప కళాశాలలో మొత్తం 70 సీట్లు ఉన్నాయి. జూన్ 20వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఇచ్చారు. బధిర విద్యార్థులకు టీటీడీ విద్యాసంస్థలలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు టీటీడీ అవకాశం కల్పిస్తోంది. అర్హత సాధించిన వారికి ఉచిత విద్యతో పాటుగా వసతి సౌకర్యం కల్పిస్తారు. కోర్సు వ్యవధి రెండేళ్లుకాగా.. ఆగస్టులో ప్రవేశ ప్రక్రియ ఉండనుంది. అలిపిరి రోడ్డులోని క్యాంపస్‌లో 90 సీట్లు ఉన్నాయి. జూన్ 1వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీగా అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ చదివేందుకు కూడా టీటీడీ అవకాశం కల్పిస్తోంది. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టనున్నారు. ఈ రెండు కాలేజీల్లో బాలురకు అవకాశం ఉండగా.. ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కాలేజీలో మాత్రం బాలికలకు ప్రవేశాలు ఉంటాయి. డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు వసతి సౌకర్యం కూడా టీటీడీ కల్పిస్తోంది.

## చర్లపల్లి నుంచి తిరుపతికి వీక్లీ రైళ్లు

హైదరాబాద్, మే 23 (ఈవార్తలు): హైదరాబాద్ నుంచి తిరుపతికి ప్రయాణించే యాత్రికులకు, ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణ నుంచి తిరుమల వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి తిరుపతి ప్రాంతానికి రెండు వేర్వేరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదించింది. ఈ నిర్ణయంతో ప్రయాణికుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. చర్లపల్లి - తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17444/17443) ఇప్పటికే ప్రత్యేక రైలుగా నడుస్తున్న సర్వీసును రైల్వే శాఖ క్రమబద్ధీకరించి, చర్లపల్లి - తిరుపతి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా ప్రకటించింది. ఈ రైలు (నం. 17444) మే 29, 2026 నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 4:20 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (నం. 17443), మే 28, 2026 నుంచి ప్రతి గురువారం సాయంత్రం 4:30 గంటలకు తిరుపతిలో ప్రారంభమై, మరుసటి రోజు ఉదయం 8:25 గంటలకు చర్లపల్లికి వస్తుంది. చర్లపల్లి - తిరుచానూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17059/17060) దీంతో పాటు, చర్లపల్లి - తిరుచానూరు మధ్య మరో కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ఇటీవలే ప్రారంభించారు. మే 17న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
ఆదివారం 24-5-2026, జగిత్యాల | www.evarthalu.com | 10

లావణ్య చిత్రం



## నా అభిమాన హీరో కింగ్: రోజా



భారతీయ సినీ పరిశ్రమలో తనదైన వైవిధ్యమైన పాత్రలతో, వైభవోపేతంగా 40 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న కింగ్ అక్కినేని నాగార్జునకు మాజీ మంత్రి, నటి రోజా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగార్జున పుట్టినరోజును పురస్కరించుకుని ఆమె ట్వీట్ చేశారు. తన అభిమాన హీరో అయిన నాగార్జున సినీ ప్రయాణం అద్భుతమైనదని రోజా కొనియాడారు. సినిమా పట్ల ఆయనకున్న ప్యాషన్, నిరంతర కృషి, ఆయన అందించిన బ్లాక్‌బస్టర్ విజయాలు తరతరాల నటీనటులకు, ప్రేక్షకులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. పరిశ్రమలో ఎన్నేళ్లు గడిచినా, ఎన్ని తరాలు మారినా నాగార్జున ఎప్పటికీ 'ఎవర్ గ్రీన్ మన్మథుడు' అని రోజా అభివర్ణించారు. నాగార్జున ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని రోజా ఆకాంక్షించారు.


## తెలంగాణలో 'పెద్ది' టికెట్ రేట్ల పెంపు లేనట్లే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం పెద్ది విడుదలకు ముందే టాలీవుడ్ లో కొత్త చర్చకు దారితీసింది. ఆ సినిమా టికెట్ ధరల పెంపు అంశంపై తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ముఖ్యంగా తెలంగాణలో పెద్ది సినిమాకు టికెట్ ధరలు పెంచబోమని స్పష్టం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో తెలంగాణకు చెందిన కొంతమంది ఎగ్జిబిటర్లు మాట్లాడుతూ.. కేవలం ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే టికెట్ రేట్ల పెంపు ఉండొచ్చని తెలిపారు. తెలంగాణలో మాత్రం పెంపు ఉండదని చెప్పారు. ప్రేక్షకులపై అదనపు భారం వేయడం సరైంది కాదని, ఇప్పటికే ఆ విషయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రేక్షకులను చంపొద్దని, అధిక ధరలతో థియేటర్లకు దూరం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. గత కొంతకాలంగా భారీ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం సాధారణంగా మారింది. అయితే ఆ నిర్ణయాల వల్ల మధ్యతరగతి ప్రేక్షకులు సినిమాలకు దూరమవుతున్నారనే అభిప్రాయం ఎగ్జిబిటర్లలో పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు థియేటర్ కు రావడంలో వెనకడుగు వేస్తున్నారని వారు చెబుతున్నారు. అందుకే తెలంగాణలో సాధారణ ధరలకే సినిమాలను ప్రదర్శించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.




## అవికాగోర్ స్వీట్ వార్నింగ్

చిన్నారి పెళ్లికూతురు సీరియల్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అవికా గోర్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి సినిమా కంటే.. తనపై వచ్చిన ఓ షాకింగ్ రూమర్ గురించి చేసిన కామెంట్స్ తో సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోకి వచ్చారు. తనపై వచ్చిన గాసిప్ ను తిట్టకుండా.. దాన్ని రాసిన వాళ్ల క్రియేటివిటీని మెచ్చుకోవడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అవికా నటించిన అగ్లీ స్టోరీ మూవీ రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నందు హీరోగా నటించిన ఆ చిత్రానికి ప్రణవ్ స్వరూప్ దర్శకత్వం వహించాడు. ఆ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా అవికా తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా తాను 18 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తనపై వచ్చిన ఒక రూమర్ గురించి చెప్పిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. 18 ఇయర్స్ వయసులో తనకు 32 ఏళ్ల యాక్టర్ తో ఏకంగా అఫైర్ ఉందని రాశారని గుర్తు చేసుకున్నారు. 'అంతేకాదు.. మేమిద్దరం సీక్రెట్ గా పెళ్లి చేసుకుని బిడ్డను కూడా కన్నామని చెప్పారు. ఆ బిడ్డను అందరికీ దాచిపెట్టారని కథ కూడా యాడ్ చేశారు ' అంటూ నవ్వుతూ తెలిపారు. ఆ రూమర్ చదివినప్పుడు తాను షాక్ అయ్యానని.. కానీ అదే సమయంలో క్రియేటివ్ గా మాత్రం అనిపించిందని తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ.. "ఆ నటుడితో నేను ఎప్పుడు లవ్ లో పడ్డానో నాకే తెలియదు. మేమిద్దరం కలిసి పని చేశాం అంతే. కానీ వాళ్లు మాత్రం పూర్తి లవ్ స్టోరీ తయారు చేశారు. పైగా బిడ్డను కూడా యాడ్ చేశారు. అసలు ఏ లెవెల్‌లో ఆలోచించారో అర్థం కాలేదు. అలా రాసేవాళ్లు సినిమాలకు కథలు రాస్తే బాగుంటుంది" అంటూ సరదాగా వ్యాఖ్యానించింది.



## చిరు - వంగా కాంబో?



టాలీవుడ్ లో తనదైన ఇంటెన్స్ మేకింగ్, బోల్డ్ కథలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్లలో ఒకరిగా నిలిచారు. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి సినిమాలతో హీరోల ఎమోషన్స్ ను రా అండ్ అగ్రెసివ్ గా చూపించిన సందీప్.. ఇప్పుడు చిరంజీవిపై చేసిన కామెంట్స్ తో మరోసారి చర్చల్లోకి వచ్చారు. ఆయనతో సినిమా చేయాలన్న తన కోరికను ఆయన ఓపెన్ గా చెప్పడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. సందీప్ రెడ్డి వంగా సినిమాలంటే ప్రేమ, కోపం, బాధ.. ఏ ఫీలింగ్ అయినా ఎక్స్ట్రీమ్ స్థాయిలో కనిపిస్తుంది. హీరో క్యారెక్టర్లలో కనిపించే ఆ ఇంటెన్సిటీకి కారణం ఏమిటనే ప్రశ్నకు సమాధానం మాత్రం చిరంజీవి సినిమాలేనని తెలుస్తోంది. ముఖ్యంగా ఆరాధన'సినిమాలో చిరంజీవి పోషించిన పులిరాజు పాత్ర సందీప్ పై ఎఫెక్ట్ చూపిందని చర్చ జరుగుతోంది. ఇటీవల సందీప్ తన ఆఫీస్ కు సంబంధించిన ఓ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో గోడపై ఉన్న చిరంజీవి ఫ్రేమ్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అది సాధారణ ఫోటో కాదు. ఆరాధన సినిమాలో హీరోయిన్ సుహాసిని చెంపదెబ్బ కొట్టిన తర్వాత చిరంజీవి ఇచ్చిన ఎక్స్ప్రెషన్ కు సంబంధించిన స్టిల్. ఆ ఒక్క ఎమోషన్ నే ఫ్రేమ్ కట్టించి ఆఫీస్ లో పెట్టుకోవడం ద్వారా సందీప్ ఎంతటి హార్డ్ కోర్ చిరు ఫ్యానో అర్థమవుతోంది. తాజాగా ఓ ఈవెంట్ లో పాల్గొన్న సందీప్.. తన ఫేవరెట్ హీరో ఎవరు? ఎవరితో సినిమా చేయాలని ఉంది? అనే ప్రశ్నకు వెంటనే చిరంజీవి పేరే చెప్పారు. దీంతో ఆ కాంబినేషన్ పై సోషల్ మీడియాలో మరింత హైప్ పెరిగింది.

## జాన్వీకి కలిసొచ్చేనా..!



హిందీ సినీ పరిశ్రమలో మంచి గుర్తింపును సంపాదించుకున్న తర్వాత జాన్వీ కపూర్, దేవర : పార్ట్ 1 చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా విడుదలకు ముందు ఆమె పాత్రపై ప్రేక్షకులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాల్లో జాన్వీ తన గ్లామర్‌తో ఆకట్టుకోవడంతో, నటన పరంగా కూడా మెప్పిస్తే తెలుగులో ఈ ముద్దుగుమ్మకు తిరుగుండదని అప్పట్లో చాలామంది అభిప్రాయపడ్డారు. అయితే, 'దేవర' చిత్రంలో జాన్వీ పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోయింది. ముఖ్యంగా సెకండాఫ్‌లో వచ్చే ఆమె పాత్ర, గ్లామర్‌కు మాత్రమే పరిమితమైందనే విమర్శలు వినిపించాయి. నటనకు పెద్దగా స్కోప్ లేకపోవడంతో ఆమె తన ప్రతిభను పూర్తిగా చూపించలేకపోయిందని కొందరు భావించారు. ప్రస్తుతం జాన్వీ 'పెద్ది' చిత్రంలో హీరోయిన్గా నటిస్తోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాల్లో కూడా ఆమె గ్లామర్‌తోనే ఆకట్టుకుంటోంది. దీంతో ఈసారి అయినా నటన పరంగా బలమైన ప్రదర్శన ఇస్తే తెలుగులో వరుస అవకాశాలు దక్కే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే కేవలం గ్లామర్‌కే పరిమితమైతే అవకాశాలు తగ్గుముఖం పట్టే ఛాన్స్ కూడా ఉందని చెబుతున్నారు. దాంతో జాన్వీ కపూర్‌కు 'పెద్ది' సినిమా కీలకంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఊచలు లెక్కపెట్టిస్తా

ఏఐ బికినీ ఫొటోలపై రుక్మిణి వసంత్ ఫైర్ అయింది. ఆ వైరల్ కంటెంట్ కు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది రుక్మిణి వసంత్. ఆ చిత్రాలు పూర్తిగా ఏఐతో సృష్టించారని, తన ఇమేజ్ ను దెబ్బతీసేందుకు కొందరు చేసిన కుట్ర అని ఆమె ఆరోపించింది. 'నా పేరుతో ఆన్‌లైన్‌లో చలామణి అవుతున్న ఏఐ చిత్రాలు పూర్తిగా నకిలీవి. ఇలాంటి మార్ఫింగ్ కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమే. ఈ విషయాన్ని మేము సీరియస్‌గా తీసుకుంటున్నాం. వీటిని సృష్టించిన వారిపై, వ్యాప్తి చేస్తున్న వారిపై చట్టపరమైన, సైబర్ క్రైమ్ చర్యలు తీసుకుంటున్నాం' అని స్పష్టం చేసింది.







# శ్రేయస్ పంజాబ్

## అయ్యర్ అజేయ సెంచరీ.. పంజాబ్ ఘన విజయం

**ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తమ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) వీరోచిత సెంచరీతో ముందుండి నడిపించాడు. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. 197 పరుగుల టార్గెట్ ను మరో రెండు ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి విజయభేరి మోగించింది.**

అయ్యర్ తన తొలి ఐపీఎల్ సెంచరీని నమోదు చేయడంతో పాటు, జట్టుకు మరపురాని విజయాన్ని అందించాడు. ఈ ఓటమితో లక్నో ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలవడం ఖాయమైంది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే ప్రియాన్ష్ ఆర్య (0) ఔట్ కాగా, కాసేపటికే కూపర్ కనోలీ (18) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో పంజాబ్ 22 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్



శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పారు. విజయం దిశగా సాగుతున్న దశలో ప్రభ్‌సిమ్రాన్ ఔటయ్యాడు. అప్పటికి పంజాబ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా, శ్రేయస్ అయ్యర్ పూర్తి బాధ్యత తీసుకున్నాడు. గేర్లు మార్చి దూకుడుగా ఆడిన అతను, మహ్మద్ షమీ వేసిన ఓవర్లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్‌ను లాగేశాడు. చివరికి మరో భారీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించడమే కాకుండా, తన కెరీర్‌లో తొలి ఐపీఎల్ సెంచరీని స్టైల్‌గా పూర్తి చేసుకున్నాడు. ఒత్తిడిలో ఒక కెప్టెన్‌గా అతను ఆడిన తీరు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జాష్ ఇంగ్లిస్ (72), ఆయుష్ బదోని (43) రాణించడంతో లక్నో పోరాడగలిగే స్కోరును సాధించింది. అయితే, కేవలం ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతో బరిలోకి దిగిన లక్నో, బౌలింగ్‌లో వైఫల్యం చెంది ఈ స్కోరును కాపాడుకోలేకపోయింది. కీలక సమయంలో వికెట్లు తీయలేకపోవడం, అయ్యర్ దూకుడును అడ్డుకోలేకపోవడం లక్నో ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

### ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 14 | 9 | 5 | 18 |
| గుజరాత్ | 14 | 9 | 5 | 18 |
| హైదరాబాద్ | 14 | 9 | 5 | 18 |
| పంజాబ్ | 14 | 7 | 6 | 15 |
| రాజస్థాన్ | 13 | 7 | 6 | 14 |
| కోల్‌కతా | 13 | 6 | 6 | 13 |
| చెన్నై | 14 | 6 | 8 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| ముంబై | 13 | 4 | 9 | 8 |
| లక్నో | 14 | 4 | 10 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



## పంజాబ్ ప్లేఆఫ్స్ అర్హత సాధించాలంటే?

పంజాబ్ ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే లక్నోపై కచ్చితంగా గెలవాలి. అన్నట్లుగానే గెలిచింది. కానీ, ఇతర జట్ల ఫలితాలపై కూడా పంజాబ్ ఆధారపడాల్సి ఉంటుంది. పాయింట్ల పట్టికలో పంజాబ్ కంటే ముందున్న రాజస్థాన్ రాయల్స్, తమ తదుపరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడిస్తే పంజాబ్ ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతవుతాయి. ఒకవేళ రాజస్థాన్ తడబడితే, 15 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగే చివరి మ్యాచ్ ఫలితంపై కూడా పంజాబ్ కన్నేయాల్సి ఉంటుంది.

## కేకేఆర్ మ్యాచ్‌తో తడబడ్డాం: పాంటింగ్

ఒకదశలో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో కొనసాగింది. తొలి ఏడు మ్యాచుల్లో ఆరు విజయాలతో దూసుకుపోయింది. కేకేఆర్‌తో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అయింది. రెండో స్టేజ్ నుంచి మొదలు.. ఒక్క విజయమూ లేకుండా పోయింది. వరుసగా ఆరు మ్యాచుల్లో పరాజయం చవిచూసింది. ఇప్పుడు తన చివరి మ్యాచ్‌లో గెలిచినా.. ప్లేఆఫ్స్‌నకు చేరుకోవడం కష్టమే. ఇతర జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో తమ జట్టు పతనంపై పంజాబ్ ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'తొలి ఆరేడు మ్యాచుల్లో మా ఆట అద్భుతం. ఎవరూ వంక పెట్టేందుకు లేదు. మంచి జోష్ మీదున్నప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ రద్దు అయింది. అప్పటి నుంచి మా దూకుడు కాస్త తగ్గింది. ఆ తర్వాత కూడా నాలుగు మ్యాచుల్లో గెలిచాం. కానీ, ఆధిపత్యం ప్రదర్శించలేకపోయాం. వరుసగా ఆరు మ్యాచుల్లో ఓడిపోయాం. అందుకు మేమే బాధ్యులం. గత కొన్ని వారాలుగా మేం అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించకపోవడం వల్లే ఇప్పుడీ పరిస్థితుల్లో ఉన్నాం' అని రికీ వెల్లడించాడు.



## చెన్నైకి కోచ్‌గా ధోనీ చాలు: అశ్విన్

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఘోరంగా నిరాశపరిచింది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సమిష్టితత్వం కొరవడి ప్లే ఆఫ్స్ ముందే ఇంటిదారి పట్టింది. దాంతో.. హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సహా కోచింగ్ బృందంలో మార్పులు తథ్యమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ రెండో సీజన్ నుంచి సీఎస్కే కోచ్‌గా కొనసాగుతున్నఫ్లెమింగ్ స్థానంలో దూకుడుగా ఆలోచించగల శిక్షకుడు అవసరమే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో చెన్నై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. ఎంఎస్ ధోనీ ఉండగా కొత్త కోచ్ కోసం వెతుకులాట ఎందుకు? అని ప్రశ్నించాడు. ఒకప్పుడు 'డాడీస్ ఆర్మీ'గా పేరొందిన చెన్నై సూపర్ కింగ్స్ పంతొమ్మిదో సీజన్ వేలంలో పోటీపడి కుర్రాళ్లను కొనుక్కుంది. కానీ, లీగ్ దశ ద్వితియార్థంలోనే వారికి అవకాశాలివ్వడంతో.. ఆలస్యంగా పుంజుకున్నా ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. స్క్వాడ్‌లో కార్తిక్ శర్మ, ఉర్విల్ పటేల్, ప్రశాంత్ వీర్ వంటి ప్రతిభావంతులున్నా వారిని సరిగ్గా ఉపయోగించుకోలేకపోవడం సీఎస్కే ప్లే ఆఫ్స్ అవకాశాల్ని దెబ్బతీసింది. దాంతో.. వచ్చే సీజన్‌కు ముందే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తొలగించి.. అతడి స్థానంలో టీ20 ఆటపై అవగాహనున్న వారికి బాధ్యతలు ఇచ్చినా ఆశ్చర్యమేమీ లేదు. అయితే.. మాజీ కెప్టెన్ ధోనీ ఉండడంతో కొత్త కోచ్‌ను ఎంపిక చేయడం సీఎస్కేకు చాలా సులభమని, మహీనే సరైనోడు అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. సీఎస్కే తదుపరి కోచ్‌గా అశ్విన్ తప్ప ఎవరిని ఎంపిక చేసినా అభ్యంతరం లేదని ఒక యూజర్ పెట్టిన పోస్ట్‌పై అశ్విన్ స్పందించాడు. 'నేను 11 మందిని ఎంపిక చేస్తే ప్రత్యర్థి జట్టుకు మా బౌలింగ్, బ్యాటింగ్ ప్రణాళిక గురించి తెలిసిపోతుంది. అవినీతి నిరోధక శాఖ నన్ను విచారించి.. నా వైఫల్యమే కారణమని చెబుతుంది. నియమాలు కూడా తెలుసుకోవాలి అని సూచిస్తుంది. చివరగా.. ఎంఎస్ ధోని ఉండగా కోచ్‌గా ఎవరి కోసమే వెతకడం దండగ' అని అశ్విన్ పోస్ట్ పెట్టాడు.

## కోహ్లి వ్యూహం బాగుంది: సెహ్వాగ్

ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ స్టేజ్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అగ్రస్థానంతో ముగించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడినా సరే.. మెరుగైన నెట్ రన్‌రేట్‌తో తొలి స్థానం దక్కించుకుంది. దీంతో మొదటి క్వాలిఫయర్‌లో ఆడే ఛాన్స్‌ను అందుకొంది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 256 పరుగుల లక్ష్య ఛేదన కోసం ఆర్సీబీ ఏ దశలోనూ పోరాడలేదు. కేవలం తమ నెట్ రన్‌రేట్‌ను మెరుగుపర్చుకునేలా మాత్రమే ఆడింది. దీనిపై మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందిస్తూ.. విరాట్ కోహ్లి వ్యూహం చాలా బాగుందని ప్రశంసించాడు. హైదరాబాద్ చేతిలో ఓడినా.. ప్లేఆఫ్స్ రేసులో మాత్రం గెలిచిందని వ్యాఖ్యానించాడు.



'ఒకవేళ ఆర్సీబీ దూకుడుగా ఆడుంటే తప్పకుండా 170 పరుగుల్లోపే కుప్పకూలేది. అప్పుడు టాప్-2 ప్లేస్‌మెంట్‌పై ప్రభావం పడేది. అలాకాకుండా.. తమకు అవసరమైన నెట్ రన్‌రేట్ సాధించేందుకు ఆర్సీబీ ప్రయత్నించింది. ఈ వ్యూహం తప్పకుండా అద్భుతమైందే. ఓటమిలోనూ విజయం ఎదురుకావడమంటే ఇదే. ఆరంభంలో వెంకటేశ్ అయ్యర్ దూకుడుగా ఆడి మిగతా బ్యాటర్లపై ఒత్తిడి లేకుండా చేశాడు. బెంగళూరు అనుకొనే లక్ష్యానికి అక్కడే పునాది వేశాడు. మరోవైపు విరాట్ నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. ఈ సీజన్‌లో అతడు ఇలా స్లోగా ఆడటం ఇదే మొదటిసారి అనుకుంటా' అని సెహ్వాగ్ తెలిపాడు.

## పింక్ పడుద్ది!





**వన్డేలు, టీ20ల్లోనూ గులాబీ బంతి**

**డ్రింక్స్ బ్రేక్‌లో హెడ్‌కోచ్‌కు అనుమతి**

**త్వరలో ఐసీసీ భేటీలో కీలక నిర్ణయాలు!**

మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో సమూల మార్పులకు ఐసీసీ శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీల్లో మహిళా క్రికెటర్లకు పురుషులతో సమానంగా నగదు బహుమతిని అమలు చేస్తున్న ఐసీసీ ఈసారి బంతిపై దృష్టి సారించనుంది. ప్రస్తుతం టెస్టులకే పరిమితమైన పింక్ బాల్‌ను ఇక నుంచి వన్డే, టీ20ల్లోనూ ప్రవేశపెట్టేందుకు అత్యున్నత క్రికెట్ మండలి పావులు కదుపుతోంది. అన్నీ కుదరితే అహ్మదాబాద్‌లో జరగనున్న ఐసీసీ సమావేశంలో నిర్ణయం వెలువడే అవకాశముంది. పొట్టి క్రికెట్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న ఈ రోజుల్లో టెస్టులు, వన్డేలను మరింత ఆసక్తిగా మార్చేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. ఇదివరకే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌కు జీవం పోసిన ఐసీసీ ఈసారిడ్రింక్స్ బ్రేకులోనూ హెడ్‌కోచ్‌ను అనుమతించాలనే ఉద్దేశంతో ఉంది. అలానే వన్డే, టీ20ల్లోనూ గులాబీ బంతికి ఓకే చెప్పడం, పొట్టి క్రికెట్‌లో ఇన్నింగ్స్ విరామం సమయాన్ని కుదించడం, ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమివ్వడం వంటి వాటిపై ఐసీసీ దృష్టి సారిస్తోంది. బౌలర్లు బా అహ్మదాబాద్ వేదికగా మే 30న జై షా నేతృత్వంలోని ఐసీసీ ప్రతినిధుల సమావేశంలో వీటిపై తీర్మానాలు చేసి.. ఆమోద ముద్ర వేసే అవకాశముంది. టెస్టు క్రికెట్ ఆరంభం నుంచి ఎర్ర బంతినే ఉపయోగించేవారు. కానీ, ఈమధ్య గులాబీ బంతి టెస్టు మ్యాచులు చూశాం. ఐదు లేదా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా డే నైట్‌లో పింక్ బాల్ టెస్టు ఆడిస్తున్నారు. వన్డేలు, టీ20ల్లో ఎప్పటి నుంచో తెల్ల బంతినే వాడుతున్నారు. ఇకపై పరిస్థితులను బట్టి వన్డే, టీ20ల్లోనూ పింక్ బాల్ మ్యాచ్‌లకు ఐసీసీ అనుమతించనుంది. ఇరుజట్లు అంగీకరిస్తే డే నైట్ మ్యాచుల్లో గులాబీ బంతిని వాడేందుకు అనుకూలంగా నిబంధనలను మార్చనుంది.

### ఇన్నింగ్స్ బ్రేక్ కుదింపు

టీ20ల్లో ఇన్నింగ్స్ బ్రేక్‌ను కుదించడంపై ఐసీసీ సభ్యులు ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం తొలుత ఆడిన జట్టు ఇన్నింగ్స్ ముగిశాక 20 నిమిషాలకు రెండో జట్టు ఇన్నింగ్స్ మొదలవుతుంది. ఈ సమయాన్ని 15 నిమిషాలకు మార్చాలని ఐసీసీ బృందం భావిస్తోంది. ఇన్నింగ్స్ ముగిశాక ఆటగాళ్లు కలిసి.. చర్చించుకునేందుకు ఐదు నిమిషాలు పడుతుంది. మరో పది నిమిషాల తర్వాత వారు మైదానంలోకి దిగేలా నిబంధనలు మార్చాలని ఐసీసీ ప్రతినిధులు అనుకుంటున్నారు. ప్రస్తుతం టీ20ల్లో మాత్రమే డ్రింక్స్ బ్రేకులో హెడ్‌కోచ్‌లను మైదానంలోకి అనుమతిస్తున్నారు. వన్డేలు, టెస్టుల్లో మాత్రం స్క్వాడ్‌లోని ఆటగాళ్లకు మాత్రమే డ్రింక్స్‌ను గ్రౌండ్‌లోకి తీసుకువస్తుంటారు. కానీ, ఇకపై ఈ రెండు ఫార్మాట్లలోనూ ఇన్నింగ్స్ మధ్యలో కోచ్‌లను మైదానంలోకి అనుమతివ్వాలని ఐసీసీ భావిస్తోంది. అయితే.. డ్రింక్స్ తెచ్చే ఆటగాళ్లు క్రికెట్ జెర్సీ వేసుకోవాలి. ఇప్పుడు కోచ్‌లకు కూడా అదే నియమం వరిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది. అలానే.. ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు హ్యాక్ ఐ డేటాను పరిశీలించే అవకాశమివ్వాలని ఐసీసీ అనకుంటోంది. తద్వారా మైదానంలో బౌలర్లు ఎలాంటి అనైతికమైన పనులకు పాల్పడకుండా చూడాలని భావిస్తోంది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 24-5-2026, జగిత్యాల


## వీధి పోరాటాలు లేవు..

సోషల్ మీడియానే వాళ్ల పోరాట వేదిక
**కొట్లాటలు లేవు..**
కామెంట్లు, మీమ్స్, రీల్సే వాళ్ల పిడికిళ్లు
**రక్తపాతాలు లేవు..**
ఫొటోలు, వీడియోలే వాళ్ల చావుదెబ్బలు
వాళ్లు కూర్చున్నచోటే అగ్గిని పుట్టిస్తారు..!
అరచేతిలో ఉద్యమాన్ని నడిపిస్తారు..!!
క్షణాల్లో నెట్టింట్లో రచ్చ లేపుతారు..!
ఎంతటి ప్రభుత్వానికైనా పిచ్చెక్కిస్తారు..!!
చూపిస్తారు.. జెన్ జీ దెబ్బ..!
కోపమొస్తే అవుతారు.. 'బొద్దింక'..!!

పౌరుషానికి ఎక్కడా తగ్గని మనస్తత్వం వాళ్లది. సవాళ్లకు ఎదురొడ్డే తీరు వాళ్లది. బంగ్లాదేశ్, నేపాల్, కెన్యా, ఇండోనేషియా.. ఇలా అనేక దేశాల రాజకీయ ముఖచిత్రాలు జెన్ జీ దెబ్బకు తలకిందులయ్యాయి. అలాంటిది.. తమను బొద్దింక అంటే ఊరుకుంటారా? అన్నది ఎవరైనా, ఎంతటి వారైనా తమ ప్రతాపం చూపించేదాకా వదలరు. భారత ప్రధాన న్యాయమూర్తి అన్న ఒక్క మాట.. వాళ్లలో అసహనాన్ని లావాలా ఉప్పొంగించింది. దెబ్బకు రాజకీయ పార్టీలు కంగుతినేలా సోషల్ మీడియాలో ఒక ఉద్యమం పుట్టింది. అది డిజిటల్ రాజకీయ పార్టీగా అవతరించేలా చేసింది.

**భారత రాజకీయ ముఖచిత్రంపై రాత్రికి రాత్రే ఉప్పెనలా దూసుకొచ్చిన ఒక డిజిటల్ వ్యంగ్య రాజకీయ ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ'. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన ఒక వ్యాఖ్యతో రాజుకున్న ఈ ఆన్‌లైన్ అగ్గి.. దేశంలో నిరుద్యోగ యువతలో, ముఖ్యంగా జెన్ జీ తరంలో పేరుకుపోయిన అసహనానికి, ఆక్రోశానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.**

**యువత మద్దతు అధికార భారతీయ జనతా పార్టీకి మెండుగా ఉన్నా, వారి అంతరంగంలో రగులుతున్న తీవ్ర అసంతృప్తిని, నిస్సహాయతను ఈ ఉద్యమం బట్టబయలు చేస్తోంది. మే 15, 2026న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, ఓ వర్గం నిరుద్యోగ యువతను ఉద్దేశించి 'బొద్దింకలు', 'సమాజ పరాన్నజీవులు' అని వ్యాఖ్యానించడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. (ఆ తర్వాత ఆయన కేవలం నకిలీ డిగ్రీలు ఉన్నవారిని ఉద్దేశించి మాత్రమే ఆ మాట అన్నానని వివరణ ఇచ్చుకున్నప్పటికీ, జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది).**



# జిర్రపురుగు.. జెన్ జీ!

**ఈ వ్యాఖ్యలను తమ అస్తిత్వంపై జరిగిన దాడిగా భావించిన యువత.. ఏ 'బొద్దింక' అయితే అసహ్యానికి ప్రతీకగా వాడబడిందో, అదే బొద్దింకను తమ ఆత్మగౌరవ, తిరుగుబాటు చిహ్నంగా మార్చుకున్నారు. మే 16న ఆప్ మాజీ సోషల్ మీడియా వ్యూహకర్త అభిజీత్ దీప్కే నేతృత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించింది. ఆశ్చర్యకరంగా, వారం రోజుల్లోనే (మే 23 నాటికి) ఇది ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 2 కోట్ల (20 మిలియన్ల) ఫాలోవర్లను సంపాదించుకుని రికార్డు సృష్టించింది.**

శ్రావణ వాణి



- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్ (MTech, LLB)
ఫోన్ నంబర్: 9581291919

## బీజేపీకి మద్దతు ఉన్నా.. ఎందుకీ అసహనం?

సమకాలీన రాజకీయాలను గమనిస్తే, దేశంలోని జెన్ జీ యువతలో జాతీయవాదం, సాంస్కృతిక పునరుజ్జీవనం, బలమైన నాయకత్వం పట్ల ఆకర్షణ వల్ల బీజేపీకి స్పష్టమైన ఓటు బ్యాంకు ఉంది. వారు మోదీ ప్రభుత్వ నిర్ణయాలను, సైద్ధాంతిక విధానాలను సమర్థిస్తున్నారు. కానీ, ఈ సైద్ధాంతిక మద్దతు వారి వాస్తవిక జీవితాల్లోని ఆర్థిక భద్రత లేమిని కప్పిపుచ్చలేకపోతోంది. ఈ వైరుధ్యమే అసలైన సమస్యకు కేంద్ర బిందువు. ఉన్నత చదువులు చదివి, డిగ్రీలు చేతిలో ఉన్నా సరైన ఉద్యోగాలు లేకపోవడం యువతను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. బద్ధకస్తులు, నిరుద్యోగుల గొంతుక అనే సీజేపీ నినాదం వారి వాస్తవిక బాధకు అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో డొల్లతనం, పేపర్ల లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలు తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయని యువత రగిలిపోతోంది. ఎన్నికల సమయంలో తమను దేశ భవిష్యత్తుగా కీర్తించే నాయకులు, వ్యవస్థలు.. తీరా తమ ఉపాధి, బతుకుదెరువు విషయానికి వచ్చేసరికి తమను పరాన్నజీవులుగా చూడటాన్ని ఆత్మాభిమానం ఉన్న ఈ తరం జీర్ణించుకోలేకపోతోంది.

అందుకే కాక్రోచ్ జనతా పార్టీకి నీరాజనాలు పలుకుతున్నారు. ఇక్కడ రాళ్ల విసురుడు, బంద్‌లు లేవు. బదులుగా, మీమ్స్, రీల్స్, వ్యంగ్య కవితల ద్వారా యువత తమ అసహనాన్ని వ్యక్తం చేస్తోంది. సాధారణంగా అసహ్యించుకునే బొద్దింకను, తమ నిస్సహాయతకు, ఎంత అణచివేసినా చావని తమ పోరాటతత్వానికి ప్రతీకగా మార్చుకున్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగిత రేటుపై ప్రభుత్వ గణాంకాల కంటే, ఈ పార్టీ షేర్ చేస్తున్న వ్యంగ్య పోస్టులు యువతను ఎక్కువగా ఆలోచింపజేస్తున్నా యి. యువతలో పెరుగుతున్న ఈ అసహనానికి ప్రధాన కారణం విద్యార్హతలకు, మార్కెట్‌లో లభిస్తున్న ఉద్యోగాలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసం. ఇంజనీరింగ్, పీజీలు చేసిన యువత డెలివరీ బాయ్స్‌గా, క్లర్కులుగా స్థిరపడాల్సి రావడం వారిలో నైరాశ్యాన్ని నింపుతోంది. ఒక నోటిఫికేషన్ పడితే పరీక్ష జరగడానికి ఏళ్లు పడుతోంది, పరీక్ష జరిగితే పేపర్ లీకేజీల వల్ల రద్దవుతోంది. కోర్టు కేసుల వల్ల ఫలితాలు నిలిచిపోతున్నాయి. ఈ ప్రక్రియలో యువత తమ విలువైన 20ల ప్రాయాన్ని కోల్పోతున్నారు. సీజేఐ వ్యాఖ్యలు ఈ గాయంపై కారం చల్లినట్లయ్యింది.

ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో కోట్లాది మంది ఫాలోవర్లతో దూసుకుపోతున్న ఈ పార్టీ, డిజిటల్ స్క్రీన్లకే పరిమితం కాకుండా నిజమైన రాజకీయాల్లోకి అడుగుపెట్టే యోచనలో ఉంది. బీహార్ ఉప ఎన్నికల్లో ప్రతీకాత్మకంగా అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా తాము కేవలం కీబోర్డ్ వీరులం మాత్రమే కాదని, వ్యవస్థను ప్రశ్నించే సత్తా ఉన్నవాళ్లమని నిరూపించాలని చూస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనబెట్టి నిరుద్యోగులంతా ఒక్కటే అనే కొత్త వర్గీకరణను ఈ పార్టీ తీసుకురాగలిగింది. వ్యంగ్యంగా మొదలైన ఈ పార్టీ ఇప్పుడు ఆన్‌లైన్ మీమ్స్ స్థాయిని దాటిపోతోంది. దీన్ని కేవలం ఒక ఇంటర్నెట్ జోక్‌గా తీసిపారేయడానికి వీల్లేదు. ఈ ఉద్యమం ఎదుగుదలను చూసి వ్యవస్థ కూడా ఉలిక్కిపడుతోందనడానికి మే 23న జరిగిన పరిణామాలే సాక్ష్యం. పార్టీ అధికారిక వెబ్‌సైట్ అకస్మాత్తుగా ఇంటర్నెట్ నుంచి తొలగించడం, సంస్థాపకుడి ఇన్‌స్టామ్ అకౌంట్‌తో పాటు పార్టీ అకౌంట్లు లాక్ అవ్వడం లేదా హ్యాక్ అవ్వడం పాలకుల భయాన్ని సూచిస్తోంది. సోషల్ మీడియా ఖాతాలను లేదా వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం ద్వారా వ్యవస్థ తాత్కాలికంగా గొంతు నొక్కొచ్చు.. కానీ, కోట్ల మంది యువత మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలను ఎవరూ బ్లాక్ చేయలేరు. వాస్తవానికి ఈ ఉద్యమం సంప్రదాయ రాజకీయ నిరసనల కంటే భిన్నమైంది. శాంతియుతంగా, వ్యంగ్యంగా తమ నిరసనను వ్యక్తం చేసే హక్కును కూడా అణచివేయాలని చూస్తే, అది యువతలో అసహనాన్ని మరింత పెంచి, వారిని తీవ్రవాద ధోరణుల వైపు నెట్టే ప్రమాదం ఉంది. జెన్ జీ తరం రాజకీయాలకు దూరం కాదు, వారి ప్రాధాన్యాలు వేరు. వారు గుడ్డిగా ఏ పార్టీని సమర్థించరు. జాతీయవాదం పేరిట బీజేపీకి ఓటు వేసినా, తమ ఉపాధిని దెబ్బతీస్తే అదే స్థాయిలో ప్రశ్నిస్తారని కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోవర్ల సంఖ్య నిరూపించింది. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి కేవలం కార్పొరేట్ వృద్ధిని మాత్రమే కాకుండా, ఉపాధితో కూడిన వృద్ధిని సాధించడంపై దృష్టి పెట్టాలి.కాక్రోచ్ జనతా పార్టీ అనేది కేవలం ఒక వైరల్ ట్రెండ్ మాత్రమే కాదు; అది విధాన రూపకర్తలకు, పాలకులకు ఒక ప్రమాద ఘంటిక. అధికారంలో ఉన్న బీజేపీతో పాటు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ డిజిటల్ విప్లవాన్ని ఒక సిన్సియర్ 'హెచ్చరిక'గా పరిగణించా లి. నేటి యువతకు కేవలం భావోద్వేగపరమైన నినాదాలు, జాతీయవాద ప్రసంగాలు మాత్రమే సరిపోవు; వారికి చేతికి పని, బతుకుపై భరోసా కావాలి. వారికి ఉపాధి కల్పించడంలో, పారదర్శకమైన వ్యవస్థను అందించడంలో ప్రభుత్వా లు విఫలమైతే, నేడు సోషల్ మీడియాలో వ్యంగ్యంగా వినిపిస్తున్న ఈ 'బొద్దింకల' గీంకారం, రేపు బ్యాలెట్ బాక్సుల వద్ద రాజకీయ భూకంపంగా మారే ప్రమాదం పొంచి ఉంది.




రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.